ఓంశ్రీసాయిరాం

ఉపనయన సంస్కారం నేడు ఉపదేశం పొందినవారికే కాక ఉత్సవం చూసి ఉత్సాహం పొందిన మీకందరికీ కీడా లాభదాయకమే. ఢిల్లీ నుండి వచ్చిన పండితిడి ఈ సంస్కారపు అంతరార్థమును యిప్పుడు మీకు వివరించాడు. ఈ వటువులు మౌంజీబంధనం ధరించి ద్విజులు అయినారని చెప్పాడు. ఉపనయనం ద్వారా వటువు ఆధ్యాత్మిక గురువు చెంతకు చేరి గాయత్రీమంత్రం ఉపదేశం పొంది, ఉచ్ఛరించి సత్యసాక్షాత్కారమనే పరమగమ్యం చేరుకునే మార్గంలో మొదటి అడుగు వేస్తున్నాడు. సూక్ష్మమైన, స్వచ్ఛమైన ధీశక్తికోసం ప్రార్థనచేయటం మొదటి మెట్టు. రామశరణ్ పండితుడు గాయత్రీమంత్రం ఋగ్, యజస్, సామ వేదముల సారమనీ, గాయత్రీదేవి విష్ణు, సూర్య, మహేశ్వరీ, గణపతి, ఈశ్వరులనే పంచభూతాధిదేవతల సుందర సమగ్రరూపమనీ చెప్పాడు. గాయత్రీజపం వల్ల మానవులకు లౌకిక, ఆధ్యాత్మిక లాభములు సమకూరునని అన్నాడు.

ప్రతి మనిషి నాలుగు జన్మలు కలిగిన శరీరధారి. పుట్టినప్పుడు ప్రతి మానవుడూ శూద్రుడు. పరిశుభ్రత వుంఢదు. మంచిచెడుల తేడా గుర్తించగల తెలివి వుంఢదు. ఉపనయన సమయంలో గురువును చేరి ఉపదేశం పొంది ఆధ్యాత్మిక జీవితంలో అడుగుపెట్టి రెండో జన్మ పొంది ద్విజుడు అవుతున్నాడు. మానవ జీవితగమ్యానికి శిష్యుని చేర్చే బాధ్యత గురువు స్వీకరిస్తున్నాడు. అప్పుడు మనిషి జీవితంలో ద్వితీయాశ్వాసం ప్రారంభం. ఆధ్యాత్మిక శిక్షణలన్నిటిలో ఉత్తీర్ణుడై, పవిత్ర గ్రంథములను పూర్తిగా చదివి విప్రుడు అవుతున్నాడు. తాను అధ్యయనముచేసి అనుష్టానం వల్ల అనుభూతి కలిగి అంథటా బ్రహ్మస్వరూపం దర్శించి బ్రాహ్మణుడౌతున్నాడు. విప్రుడు బ్రహ్మజ్ఞానం లభించిన తరువాత బ్రాహ్మణుడు అవుతున్నాడు. ఈ బాలకులకు ఉపనయనం ఆత్మసాక్షాత్కారయాత్రలో అత్యంత ప్రధానమైన ప్రథమ ఘట్టం.

తల్లిదండ్రులు మీకు దేహాలు యిచ్చారు. గురువులు అందులో నివసించే దేహిని చూపిస్తారు. కనుకనే, వేదాలు గురువును దైవంగా పూజించమని చెబుతున్నవి. మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ. బంగారంతో నగలు చేయటానికి వెండి, రాగివంటి యితర లోహములు కలుపుతారు. భిన్నత్వముతో కూడిన వైవిధ్యమును ప్రదర్శించటంకోసం బ్రహ్మతత్త్వంలో కొంత మమకారం చేరుతుంది. బుద్ధి అనే మూసలో శ్రవణ మనన నిధిధ్యాసలు పోసి మమకారమనే మలిన పదార్థం తొలగించి బ్రహ్మతత్త్వమనే మేలిమిని పొందే మార్గం గురువు బోధిస్తాడు. జీవతత్త్వమూ, బ్రహ్మతత్త్వమూ అనేవి రెండూ ఒకే నాణెమునకు రెండు ముఖాలు. భిన్నత్వంలో ఏకత్వం సాధించటమే మానవుల కృషికి పరమలక్ష్యం. ఇది సాధించకపోతే మానవునికి లోపలా, వెలుపలా శాంతి దొరకదు. శాంతి మంత్రం ఎన్నిసార్లు జపించినా లాభంలేదు. ఈ బల్బులో, మైకులో, టేపురికార్డులో, శీతలయంత్రంలో, కుంపటిలో, మెర్క్యురీ లైటులో కనపడకుండా ఒకే విద్యుత్ శక్తి పనిచేస్తున్నది. అదేవిధంగా భిన్నత్వంలో అంతర్గతంగా వున్నటువంటి బ్రహ్మతత్త్వమును గురువు గుర్తింపజేయగలడు. ఆయనకు మీరు చాలా కృతజ్ఞులై వుండాలి. ఒక పరదేశి ఒక నిరుపేద గుడిసెలో ప్రవేశించి అక్కడ నేలలో అమూల్యమైన సంపద పాతిపెట్టి వున్నదని, దానిని త్రవ్వి పైకితీసి స్వంతంచేసకొని అనుభవించవలసినదని చెప్పాడు. అట్లనే ఎంతో మహోపకారం చేస్తున్నాడు గురువు. ఆధ్యాత్మిక సాధకులకోసం గాయత్రీ మంత్రమనే ఔషధమును విశ్వామిత్ర మహర్షి తయారుచేశాడు. ఈ ఔషధం వల్ల మానవులలో వివేక, విచక్షణ, వైరాగ్యాలు మేలుకొంటాయి. ఈ మూడు గుణాలూ వున్నందువల్ల మానవుడు జంతువుల కంటే చాలా ఉన్నతమైన స్థానంలో నిలబడుతున్నాడు.

ఒక ఇంటికి సంస్కారం చేస్తున్నామంటే ముందు బూజు దులిపి శుభ్రం చేయాలి. తరువాత కొత్త రంగులు వేయాలి. ఈ గాయత్రీమంత్రం దుష్టప్రవృత్తులను నిర్మూలించి సద్గుణ సదాచారములు నాటుకొనేటట్లు చేస్తుంది. కనుకనే, ఈ ఉపనయన సంస్కారమునకు అద్వితీయమైన ప్రాముఖ్యం. మానవుడు దివ్యాత్మస్వరూపుడు. కాని, తాను దుర్బలుడనని, బద్ధుడనని, పరిమిత శక్తిమంతుడనని భావించి ఆందోళన చెందుతాడు మానవుడు. అతని మనస్సు అటువంటి భ్రమకలిగిస్తుంది. తన నిజతత్త్వమేమిటో మిషి తెలుసుకోలేకపోతున్నాడు. ఈ భ్రమనుంచి బైటపడే దారి ఏది? మీరు రైలుకంటె ముందుగా పోవాలనుకుంటే అంతకంటే త్వరగా నడిచే కారులోనో, విమానంలోనో వెల్కాలి. రైలుకంటే నిదానంగా నడిచే వాహనం ఎక్కితే లాభం వుండదు. మీ శక్తిని తక్కువచేసి చూపే భ్రాంతిని జయించాలంటే దైవాన్ని ఆశ్రయించాలి. మానవశక్తియైన భ్రమను జయించటానికి మీరు దైవశక్తిని సంపాయంచాలి. గాయత్రీ మంత్రం అటువంటి శక్తిని మీలో పెంపుచేయగలదు.

ఉచ్ఛరించటం వల్ల రక్షించగలిగినది గాయత్రీమంత్రం. ఇంద్రియనిగ్రహమూ, జిజ్ఞాస అనే సిమలో ప్రవేశించబోతున్న ఈ బాలకులకు గాయత్రీమంత్రం కరదీపిక. వడ్లగింజ దంచి, చెరగి, శుభ్రంచేస్తే వచ్చిన బియ్యమును వండి తినవచ్చును. అదేవిధంగా, ఈ బాలబాలకులుతమ నిజతత్త్వమును కప్పివున్న పొల్లును తొగించుకోవాలి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశపంచకములో దాగి వున్న ఆత్మను గుర్తించాలి. ఈనాటినుంచీ బాలకులు చేయవలసిన త్రికాలసంధ్యావందనము ఆత్మను కప్పిన పొల్లును తొలగించే ప్రక్రియ. పెద్దలు ప్రోత్సహిస్తే త్రికాల సంధ్యావందనం చేయటానికి సమయం తప్పకుండా చిక్కుతుంది. శరీరానికి ఆహారం ఎంత అవసరమో మనస్సుకు కూడా అంత అవసరమే. ముప్పూటలా భోజనం చేయటంతోబాటుగా ప్రాతస్సంధ్య, మధ్యాహ్నసంధ్య, సాయంసంధ్య అవసరమే. ఈ ఆరింటిలో ఏది మానివేసినా యిబ్బంది తప్పదు.

దైవత్వమనే గోమాత నాలుగు వేదములనే పొదుగునుంచి చేపిన మధురక్షీరమనదగిన గాయత్రిని నేడు మీరు అందుకున్నారు. ఆధ్యాత్మికమైన ఆరోగ్యముతో మీరు విలసిల్లేటట్లు చేయగల శక్తి దానికున్నది. ఈ పాలను చిందగొట్టవద్దు. ఒలకబోయవద్దు. కాగబెట్టి, పెరుగుచేసి, చిలికి దానిలో దాగిన వెన్న తీయండి. క్రమశిక్షణమనే కవ్వంతో చిలికితే ఆనందమనే వెన్న రాగలదు. వేలాది ప్రజలు కాంక్షించే నా సన్నిధానంలో నేడు మీకు ఉపనయనం జరిగింది. కాబట్టి, మీకు ప్రత్యేకమైన బాధ్యత వున్నది. బ్రహ్మజ్ఞానమనే గమ్యమునకు చేర్చగల బ్రహ్మచర్య దీక్షను మీరు చాలా శ్రద్ధగా పాటించాలి. శరీరం పుట్టినది మాలిన్యంలో కావచ్చు. కాని, స్వచ్ఛతా, పవిత్రతా శరీరపు సహజలక్షణాలు. కాబట్టి, నిర్మలత్వమునూ, దివ్యత్వమునూ సాధించటానికి ఆరాటపడుతుంది.

ఆంతరంగిక పరిశుభ్రతను ప్రధాన లక్ష్యంగా ఎంచుకోవాలి. ఒక పాత్రలో నీరు త్రాగాలనుకున్నప్పుడు ముందుగా దాని లోపలి భాగం శుభ్రం చేస్తాము. మంచి కూరముక్కలు, చింతపండు రసము, కారము, ఉప్పు, పప్పు అన్నీ వున్నాయి. వంటవాడకూడా మంచి నేర్పరి కావచ్చు. కాని, సాంబారు కాగబెట్టే రాగిపాత్రకు కళాయి లేకపోతే అది చిలుము ఎక్కి విషతుల్యం అవుతుంది కదా. సత్కర్మ, సదాచారము పాత్రకు కళాయి వంటివి. ఆలోచనలు, ఆవేశములు, అలవాట్లు వుడుకుతూ వుండే మీ హృదయ పాత్రకు త్రికాల సంధ్యావందనంలో జపించే గాయత్రీమంత్రం విషమును విరిచే కళాయివంటిది. సర్కసులో ఏనుగు మావటివాని అంకుశపు పోటుకు చెప్పినట్లు వింటుంది. చిక్కిన ఈ సదవకాశం చక్కగా వుపయోగించుకోండి. సుమారు నాలుగు వందల ఏభైమంది బాలకులకు ఈ సదవకాశం దొరికింది. ప్రశాంతినిలయంలో కొందరు ఇవి పిల్లలకు పరీక్షల రోజులు, కాబట్టి ఎక్కువమంది నా సన్నిధికి వచ్చి ఉపదేశం పొందలేరనుకున్నారు. కాని, అలజడుల మూలంగా, సమ్మెల కారణంగా పరీక్షలు వాయిదా వేసి పాఠశాలలు మూసివేయటం జరిగింది. ఇక్కడికి వచ్చి ఉపనయనం చేసుకుంటామని మాకు వ్రాసుకున్న వారందరూ రాగలిగారు. పూర్వపుణ్య ఫలమునకు ఇది మరియొక నిదర్శనం. నేల లోపల దాగిని విత్తనాలన్నీ వర్షం కురవగానే మొలకెత్తి ప్రదేశమంతా పచ్చటి తివాచీలు పరచినట్లుంటుంది. ఈ బాలకుల పూర్వపుణ్య బీజములు అనుగ్రహ వర్షంకోసం నిరీక్షిస్తున్న సంగతి నాకు మాత్రమే తెలుసు.

సనాతనధర్మ పునరుద్ధరణకు ఈ బాలకులందరూ శక్తిమంతులైన సాధనములు. భారతవర్షవైభవమును వారు సముజ్వలం చేయగలరు. ఈనాడు వారు నా సైన్యంలో చేరినారు. ధర్మసంస్థాపనమూ, వేదపునరుద్ధరణ నా ఆశయములు. నా ఆశయ సంసిద్ధికోసమే ప్రతి సంవత్సరమూ నా సన్నిధానంలో భారతదేశపు నలుమూలలనుంచి వచ్చే బాలకులకు ఉపనయనములు జరిపిస్తున్నాను. ప్రస్తుతం చాలామంది ఉపనయన ప్రాశస్త్యమును మరచిపోతున్నారు. సంధ్యావందనమునూ, గాయత్రీమంత్రమునూ నిర్లక్ష్యం చేస్తున్నారు. కాబట్టి, వాటి తొలినాటి వైభవమును పునరుద్ధరించాలి. ఇది చాలా ముఖ్యమైన కర్తవ్యం. అక్షరరూపుని దర్శించేదాకా మీరు క్షరమును అనుష్టించి క్రమంగా దానిని అధిగమించాలి. మాటను ఒకసారిగా పలకటం వచ్చేదాకా ఒక్కొక్క అక్షరమునూ విడిగా చదవాలి. ఆ తరువాత అటాల చదవనవసరం లేదు. త్రికాల సంధ్యావందనంలో గాయత్రీమంత్రోచ్చారణం చేయటం ద్వారా అక్షరరూపుని దర్శించగలరు. క్రమంగా మీరు దేహమాతనూ, లోకమాతనూ, గాయత్రీమాతనూ భక్తిశ్రద్ధలతో పూజించాలి.